# ఉద్యాన రైతులకు తీరని నష్టం

- పంట నష్టం అంచనాలు పూర్తి
- అత్యధికంగా 1388ఎకరాల్లో మిర్చితోటలకు దెబ్బ..
- నష్టపరిహారం కోసం రైతుల ఎదురుచూపులు

కంచికచర్ల, పెనుగంచిప్రోలు : ఇటీవల కురిసిన భారీ వర్షాలు, సంభవించిన వరదల కారణంగా నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో వేలాది ఎకరాల్లోని ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. దీంతో ఆయా పంటలు సాగుచేస్తున్న రైతులు రూ.6కోట్లకుపైగా నష్టపోయారు. ఎకరాకి వేలాది రూపాయలు ఖర్చుచేసిన సాగుచేసిన పంటలు నీటిపాలు కావడంతో రైతులు తీవ్రఆందోళన చెందుతున్నారు.

**2,357ఎకరాల్లో ఉద్యానపంటలకు దెబ్బ...**

ఈ వరదలకు నందిగామ నియోజకవర్గంలో 1434మంది రైతులకు చెందిన 1682 ఎకరాల్లో ఉద్యానవనపంటలు దెబ్బతిన్నాయి. ఇందులో మిర్చితోటలు 1,118 ఎకరాల్లో దెబ్బతినగా, పండ్ల తోటలు 210ఎకరాలు, కూరగాయల సాగు 152ఎకరాలు, కంద 87 ఎకరాలు, పసుపు 102 ఎకరాలు, ఆయిల్‌ఫామ్ ఆరు ఎకరాలు, పూల తోటలు ఏడు ఎకరాల్లో దెబ్బతిన్నాయి. ఈ వరదలకు జగ్గయ్యపేట నియోజకవర్గంలో 560మంది రైతులకు చెందిన 675ఎకరాల్లోని ఉద్యానవన పంటలు నీటమునిగి దెబ్బతిన్నాయి. 338 ఎకరాల్లో కూరగాయల పంటలు దెబ్బతినగా, మిరప 270 ఎకరాలు, బొప్పాయి, మామిడి, అరటి తదితర పండ్లతోటలు 67 ఎకరాల్లో దెబ్బతిన్నాయి.

**అంచనాల తయారీలో జాప్యం..**

వరదలకు పంటలు దెబ్బతిని 20రోజులు దాటినా పంటనష్టం అంచనాల తయారీలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగానే వ్యవహరించింది. ఆగస్టు 31వతేదీ నుంచి భారీవర్షాలు ప్రారంభంకాగా, వరదలకు మునేరు, పాలేరు, ఇతర వాగులు, వంకలు పొంగి పొర్లాయి. వేలాది ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. అయితే పంటనష్టం అంచనాల తయారీలోనూ తీవ్రజాప్యం చేసిన రాష్ట్రప్రభుత్వం, బాధిత రైతులకు పరిహారం అందించి వారిని ఆదుకునే విషయంలోనూ అదే నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. వర్షాలు తగ్గిన వెంటనే వరదల కారణంగా మూడు నాలుగురోజులపాటు పొలాల్లోకి వెళ్లే పరిస్థితి లేకపోయినప్పటికీ, అనంతరం ఈ 20రోజులుగా పంటనష్టం అంచనాల తయారీలో జాప్యమే మిగిలింది. పంటనష్టం కింద ఎకరాకి రూ.10వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే అందుకు సంబంధించిన జీవోను మాత్రం ఈనెల 23వతేదీ వరకు ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో తొలుత వ్యవసాయ, రెవెన్యూ అధికారులు ఆయా పంటలనష్టాన్ని గతంలో ఉన్న జీవోకు అనుగుణంగానే తయారుచేశారు. పంటనష్టపరిహారం కింద నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లోని బాధిత రైతులకు సుమారు రూ.3.25కోట్ల వరకు చెల్లించాలంటూ అధికారులు అంచనా వేశారు. ఎట్టకేలకు ఈనెల 24వతేదీ నాటికి పంటనష్టం అంచనాలు తయారీ పూర్తిచేశారు. ప్రభుత్వం వెంటనే తగిన మార్గదర్శకాలు జారీచేయకపోవడం కూడా పంటనష్టం అంచనాల తయారీకి ఓ కారణమని అధికారవర్గాల సమాచారం.

**పరిహారం పంపిణీ మూడోసారి వాయిదా..**

పంటనష్ట పరిహారం కోసం బాధిత రైతులు రోజుల తరబడి ఆశగా ఎదురుచూస్తున్నారు. ఓవైపు వేలాది రూపాయలు ఖర్చుచేసి సాగుచేసిన ఉద్యానవనపంటలు మరికొద్దినెలల్లో చేతికొస్తాయనే సమయంలో దెబ్బతినగా, మరోవైపు ప్రభుత్వం కూడా పంటనష్టం పరిహారం పంపిణీ విషయంలో తీవ్రజాప్యం చేస్తుండటంతో బాధిత రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. వరద బాధితులకు నష్టపరిహారాన్ని ఈనెల 17వతేదీన ఇస్తామని తొలుత ప్రకటించిన సీఎం చంద్రబాబు, తర్వాత 20తేదీకి మార్పు చేశారు. తిరిగి మళ్లీ ఈనెల 25వతేదీన వరద బాధితులకు పంటనష్టపరిహారం అందిస్తామని చెప్పిన సీఎం చంద్రబాబు, కేవలం విజయవాడ నగరంలో వరదలకు నష్టపోయిన వారికి మాత్రమే పరిహారం అందిస్తామని ప్రభుత్వం పేర్కొనడంతో బాధిత రైతులు గగ్గోలు పెడుతున్నారు. పరిహారం అందజేసే విషయంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇంకెన్ని వాయిదాలు వేస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం త్వరితగిన పంటనష్టపరిహారాన్ని అందజేసి తమను ఆదుకోవాలని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాలకు చెందిన ఉద్యానవన సాగు రైతులు కోరుతున్నారు.


వరదలకు కంచికచర్ల మండలం గనిఆత్కూరులో దెబ్బతిన్న బొప్పాయి పంట


వరద పాలైన పసుపు పంట


పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతాల వద్ద వరదకు పూర్తిగా దెబ్బతిన్న అరటి తోట


కొత్తపేటలో ఇసుక మేట వేసిన మిరపతోట


పెనుగంచిప్రోలు వద్ద వరదకు దెబ్బతిన్న ఆకుకూరల సాగు

### ఈ నష్టం నుంచి కోలుకునేదెలా...



అర ఎకరంలో బీరకాయల కూరగాయాలు సాగుచేసా. ఇటీవల కురిసిన వర్షాలను పూర్తిగా దెబ్బతింది. అంతే కాకుండా మూడెకరాల్లో సాగుచేసిన పత్తి కూడా దెబ్బతింది. ఏం చేయాలో తోచడం లేదు. ప్రభుత్వ పరిహారం అందించి మమ్మల్ని ఆదుకోవాలి.

– ముప్పాళ్ల లక్ష్మీనారాయణ, కౌలురైతు, కొత్తపేట, కంచికచర్ల మండలం

### పరిహారం కోసం ఎదురుచూస్తున్నా..



ఇటీవల కురిసిన వర్షాలకు సాగుచేసిన పత్తి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. పంటలసాగు కోసం వడ్డీలకు అప్పులు తెచ్చా. తిరిగి వ్యవసాయం సాగుచేద్దామన్నా చేతిలో చిల్లిగవ్వ లేదు. ప్రభుత్వం అందించే పంట నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్నా.

– మందా శ్రీనివాసరావు, కౌలురైతు, కొత్తపేట, కంచికచర్ల మండలం

## క్లుప్తంగా

### భక్తుల సౌకర్యాలకే అధిక ప్రాధాన్యం: ఈవో


నాగకిషోర్‌కుమార్

పెనుగంచిప్రోలు: అమ్మ దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యాలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని శ్రీతిరుపతమ్మవారి ఆలయ నూతన ఈవో భూపతిరాజు వెంకట సత్యనాగకిషోర్‌కుమార్ బుధవారం తెలిపారు. ముఖ్యంగా దాతల సహకారంతో ఆలయ అభివృద్ధికి ప్రత్యేకంగా దృష్టిసారిస్తానన్నారు. ప్రసాదాల నాణ్యత విషయంలో నిబంధనలను తూచ తప్పకుండా పాటిస్తామన్నారు. ఆలయం వద్ద, మునేరు అవతల అమ్మవారి మామిడి తోటల్లో సుమారుగా రూ.13కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు మరింత వేగవంతమయ్యేలా తగిన చర్యలు తీసుకుంటానన్నారు. అందరి సహకారంతో ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన వివరించారు.

### నిత్యాన్నదాన పథకానికి విరాళాలు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి బుధవారం నందిగామ మండలం అనాసాగరం గ్రామానికి చెందిన పల్లెంపాటి కొండ, భాగ్యలక్ష్మి దంపతులు రూ.10,116, జగ్గయ్యపేటకు చెందిన బత్తిన పుల్లయ్య, లక్ష్మీ దంపతులు రూ.11,116లు విరాళంగా అందజేశారు. ఈ మేరకు విరాళాన్ని ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

### అంగనవాడీ కేంద్రం తనిఖీ

గండ్రాయి(జగ్గయ్యపేట): మండలంలోని గండ్రాయి ఎస్సీ కాలనీ అంగనవాడీ కేంద్రాన్ని ఎంఈవో చిట్టిబాబు బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగనవాడీ కార్యకర్తలు కిచెన్ గార్డెన్‌లో ఆకుకూరలు, కాయగూరల పంటలు సాగు చేపట్టాలని సూచించారు. ఎంపీయూపీ పాఠశాల హెచ్‌ఎం రమేష్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, ఆర్‌పి రాంప్రసాద్, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### నులిపురుగుల నిర్మూలన మందుల పంపిణీ

నందిగామ టౌన్: నులిపురుగుల కారణంగా పిల్లల్లో రక్తహీనతతోపాటు ఎదుగుదల లోపిస్తుందని వైద్యాధికారులు చాంద్‌బాషా, రవికుమార్ పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని లింగాలపాడు, గోళ్లమూడి పీహెచ్‌సీ పరిధిలోని చిన్నారులకు నులిపురుగుల నిర్మూలన మందులను పంపిణీ చేశారు. మాగల్లులోని జిల్లా, మండల పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సీహెచ్‌వో వర్షిణి నులిపురుగుల నిర్మూలన మందులను అందజేశారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఊరేగింపులు శాంతియుతంగా సాగాలి : ఏసీపీ



చిల్లకల్లు(జగ్గయ్యపేట): వినాయక నిమజ్జన కార్యక్రమాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని నందిగామ ఏసీపీ రవికిరణ్ సూచించారు. చిల్లకల్లులో బుధవారం నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమ ఊరేగింపును బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ అవాంఛనీయ సంఘటనలకు పాల్పడేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏసీపీ వెంట ఎస్‌ఐ తోట సూర్య శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

### రైతులను ఆదుకోవాలని డిమాండ్



జగ్గయ్యపేట: వరదలకు పాలేరు ఉపనది పరివాహక గ్రామాల్లో కోతకు గురైన పంట భూములను ప్రభుత్వం బాగుచేసి రైతులను ఆదుకోవాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ సైదులు డిమాండ్ చేశారు. మండలంలోని బలుసుపాడు, అన్నవరం, రెడ్డినాయక్‌తండా, బూదవాడ గ్రామాల్లో వరదల కారణంగా కోతకు గురైన పంటపొలాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలేటి వరద ఉధృతికి వరి, మిర్చి, పత్తి పంటలే కాకుండా ఆకుకూరల పంటలకు తీరని నష్టం వాటిల్లిందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు సైతం పంటనష్టం గురించి మాట్లాడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మికసంఘం నాయకులు కోట కళ్యాణ్, దంతాల వెంకటేశ్వర్లు, కృష్ణ, భాస్కర్, పాపయ్య, రైతులు పాల్గొన్నారు.

## చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

**ఎమ్మెల్యే రాజగోపాల్**

జగ్గయ్యపేట అర్బన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సూచించారు. స్థానిక జీవీజే జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల, నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు శారీరక దారుఢ్యానికి మంచి ఆరోగ్యానికి ఉపయోగపడతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కీడలకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. ప్రతి విద్యార్థి గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కౌన్సిలర్లు కంచేటి గీతారాణి, పేరం సైదేశ్వరరావు, నాయకులు పూసల పుల్లారావు, మెడక కోటేశ్వరరావు, పితాని శ్రీనాథ్, స్కూల్ హెచ్‌ఎం.మాధవీలత, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**హామీలను నెరవేరుస్తాం...**

గౌరవరం(జగ్గయ్యపేట): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ అన్నారు. మండలంలోని గౌరవరం సచివాలయం వద్ద బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లో అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించినట్లు తెలిపారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో సర్పంచి పావని, ఎంపీడీవో రమేష్‌బాబు, తహసీల్దార్ నాగరాజు, కార్యదర్శి జగ్గయ్య, టీడీపీ నాయకులు కట్టా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, రాఘవేంద్ర తదితరులు

## చట్టాలపై అవగాహన అవసరం

**జడ్జి శోభారాణి**

జగ్గయ్యపేట అర్బన్: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎం.శోభారాణి సూచించారు. స్థానిక సత్యనారాయణపురంలోని ఎస్టీ బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి శోభారాణి మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటి నుంచే స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కష్టపడి చదవాలని, తద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని పేర్కొన్నారు. తొలుత ఆమె పాఠశాలలోని తరగతిగదులు, భోజనశాల, వసతి సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాక సుందరరావు, ఏజీపీ ఎల్.నరసింహారావు, న్యాయవాదులు ఎం.విజయకుమారి, ఎంవీ.ఆంజనేయులు, దాసరి నాగేశ్వరరావు, వరప్రసాదరావు, కె.శ్రీనివాసరావు, మురళి, గురుకుల ప్రిన్సిపాల్ ఉమేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్జి శోభారాణి, వేదికపై సుందరరావు, న్యాయవాదులు

## కూటమి పాలనలో ఒరిగిందేమీ లేదు : సీపీఐ

నందిగామ టౌన్: టీడీపీ కూటమి ప్రభుత్వ 100రోజుల పాలనలో నాయకులు ఇళ్లకు స్టిక్కర్లు అంటించడం తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, రాష్ట్ర రైతుసంఘం అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. సీపీఐ నాయకుడు సూర్యదేవర నాగేశ్వరరావు తొమ్మిదో వర్ధంతిని స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో బుధవారం నిర్వహించారు. ముందుగా పాత బస్టాండ్ నుంచి ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలి వచ్చి నాగేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ స్వార్థ రాజకీయాల కోసం లడ్డూ పేరుతో ప్రజల మనోభావాలతో ఆడుకోవద్దన్నారు. ప్రజలకు ఏం మంచి చేశారని ఇది మంచి ప్రభుత్వమంటూ ఊరూర తిరుగుతూ కార్యక్రమాలు చేపడుతున్నారని కూటమి నేతలను నిలదీశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీ కూడా ఆచరణలో అమలుచేయలేదన్నారు. వరద ముంపునకు నష్టపోయిన ప్రతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని నష్టపోయిన ప్రతి కుటుంబానికి రూ. 50 వేలు, నష్టపోయిన ప్రతి ఎకరాకు రూ. లక్ష నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సూర్యదేవర నాగేశ్వరరావు అందించిన స్ఫూర్తితో ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాడాలని నాయకులకు పిలుపునిచ్చారు. . విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అక్టోబరు ఒకటి నుంచి నాలుగు వరకు జరిగే నిరసన దీక్షలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు దోనెపూడి శంకర్, వల్లంకొండ బ్రహ్మం, పరుచూరి రాజేంద్ర, ప్రకాశరావు, కట్టా చామంతి, సూర్యదేవర కవిత, చావల రవి, చుండూరు సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య

## తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన


పత్తి పంటను పరిశీలిస్తున్న ఏవో వరలక్ష్మి


పొలం పిలుస్తుంది కార్యక్రమంలో వ్యవసాయాధికారులు

బండిపాలెం(జగ్గయ్యపేట): వరి, పత్తి పంటలసాగులో రైతులు తగుజాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారి వరలక్ష్మి సూచించారు. గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి, పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంటలో జింకు లోపాలు, అగ్గి తెగులు తదితర తెగుళ్లను గుర్తించామన్నారు. ఆయా తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. పత్తిలో గులాబీరంగు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కృషి విజ్ఞానకేంద్రం(కేవీకే) శాస్త్రవేత్త వెంకటరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

**నందిగామ మండలంలో..**

నందిగామ టౌన్: పంటపొలాల్లో భూసార పరీక్షలకు అనుగుణంగా రైతులు ఎరువులు వినియోగించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సంచాలకులు మోనిషా సూచించారు. మండలంలోని దాములూరు, సోమవరం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు రైతులకు అవసరమైన సలహాలు, సూచనలను అందించేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ముఖ్యంగా రైతులు సాగుచేస్తున్న పంటలకు విధిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాస్, వ్యవసాయశాఖ సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

నందిగామ టౌన్: ప్రజలు మెచ్చి మంచి ప్రభుత్వమని చెప్పాలి తప్ప టీడీపీ నేతలు ఊదరగొడుతూ గోడలకు స్టిక్కర్‌లు అంటిస్తే మంచి ప్రభుత్వం కాదని సీఐటీయూ నాయకుడు కటారపు గోపాల్ పేర్కొన్నారు. మండలంలోని లింగాలపాడు గ్రామంలోని జిల్లా, మండల పరిషత్ పాఠశాలల వద్ద మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు మద్దతుగా సీఐటీయూ ఆధ్వర్యంతో బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23ఏళ్లుగా పని చేస్తున్న చిరుద్యోగులను రాజకీయ కక్ష సాధింపు చర్యలకు గురిచేసి, వారిని తొలగించడాన్ని మంచి ప్రభుత్వమంటారా అని ప్రశ్నించారు. లింగాలపాడులో ఇప్పటి వరకు తొమ్మిది మందిని తొలగించారని గుర్తుచేశారు. పాఠశాలల హెచ్‌ఎంలు, విద్యాశాఖాధికారులు సైతం రాజకీయ వత్తిళ్లకు తలొగ్గడం బాధాకరమని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సీఐటీయూ నాయకులు గోపీనాయక్, వెంకటేష్, ఖాజా, పథకం నాయకులు ఏసోబు, కళావతి, సత్యవతి, కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



లింగాలపాడులో ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, ఏజెన్సీ నిర్వాహకులు

## ఒక వ్యక్తికే పనుల కేటాయింపుపై ఆక్షేపణ



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేటలో వరద ముంపు పునరావాస పనులకు సంబంధించి కొట్టుకుపోయిన పైపులైన్ల స్థానంలో నూతన పైపులైన్ల నిర్మాణం చేయడం తదితర 8రకాల పనులను నామినేషన్ పద్ధతిపై ఒకే వ్యక్తికి కాంట్రాక్టు ఇవ్వడం తగదని పలువురు కౌన్సిలర్లు ఆరోపించారు. స్థానిక కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన బుధవారం మున్సిపల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ టి.ప్రభాకర్ మాట్లాడుతూ పునరావాసానికి సంబంధించి రూ.40లక్షల విలువగల పనులను ఒకే కాంట్రాక్టర్‌కు ఇవ్వడమంటే మిగిలిన కాంట్రాక్టర్లకు అన్యాయమన్నారు. చైర్మన్ రాఘవేంద్ర స్పందిస్తూ మిగిలిన కాంట్రాక్టర్లకు కూడా పనులు ఇచ్చినట్లు తెలిపారు. తమ కౌన్సిలర్ల సంఖ్య పెరిగినందున సీట్లను పెంచాలని టీడీపీ కౌన్సిలర్ నూకల సాంబ కోరారు. పట్టణంలోని ఆయా సమస్యలను పలువురు కౌన్సిలర్లు ప్రస్తావించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజున్నీసా, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఎజెండాలోని 19అంశాలను సభ్యులు ఆమోదించారు.

### వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ సోదరులు



నందిగామ టౌన్: ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్, నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు బుధవారం మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా జగన్‌మోహనరావు, అరుణకుమార్ మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాజిల్లా పార్టీ ఇన్‌చార్జ్‌ల సమావేశం అనంతరం కొద్దిసేపు జగన్‌మోహన్‌రెడ్డితో ముచ్చటించినట్లు తెలిపారు. నియోజకవర్గ పరిస్థితులపై చర్చించారన్నారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతోపాటు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని వివరించారు. ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారని వారు చెప్పారు.

### మాజీ సీఎంతో వేల్పుల దంపతులు



పెనుగంచిప్రోలు: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం నెడ్‌క్యాప్ మాజీ చైర్మన్ వేల్పుల రవికుమార్, సర్పంచ్ పద్మకుమారి దంపతులు కలిశారు. ఈసందర్భంగా జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఇటీవలన కురిసిన భారీవర్షాలకు జరిగిన నష్టాన్ని, నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడిగితెలుసుకున్నారని పద్మకుమారి తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నట్లు ఆమె వివరించారు.

### నేడు హుండీ లెక్కింపు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపు గురువారం నిర్వహిస్తున్నట్లు ఏసీ వరప్రసాద్ బుధవారం తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం తొమ్మిది గంటలకు ఉన్నతాధికారుల సమక్షంలో చేపట్టే లెక్కింపు కార్యక్రమంలో ఆసక్తిగల భక్తులు పాల్గొనాలని ఏసీ కోరారు.

### భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనాలు

పెనుగంచిప్రోలు: చవితి పందిళ్లలో పూజలు అందుకున్న గణనాథుని నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. గ్రామంలోని పలువీధుల్లో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాలతోపాటు మండలంలో ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను బుధవారం ఊరేగింపు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. భక్తుల తీన్‌మార్ నృత్యాలు, బాణసంచా మెరుపులతో స్వామివార్ల ఊరేగింపు కార్యక్రమం ఆద్యంతం సందడిగా సాగింది. ఊరేగింపుల అనంతరం వినాయకుడి విగ్రహాలను స్థానిక మునేరు, కాలువల్లో నిమజ్జనం చేశారు.

### లక్ష్యసాధనకు నిరంతరం శ్రమించాలి


మహాక్రతు దాసా

కంచికచర్ల : విద్యార్థులు సానుకూల దృక్పథంతో సరైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దాని సాధనకు నిరంతరం శ్రమించాలని హరేకృష్ణా గోకులం క్షేత్రం యూత్ విభాగం అధిపతి అక్షయ ఫౌండేషన్ వలంటీర్ మహాక్రతు దాసా సూచించారు. మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాల ఫస్టియర్ విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జ్ఞాపకశక్తి పెంచుకోవడం కోసం తరచూగా మెడిటేషన్, యోగా చేయాలని సూచించారు. సరైన ప్రణాళిక పాటిస్తూ పాజిటివ్ థింకింగ్, మైండ్ పవర్‌ను పెంచుకోవటంపై దృష్టి సారిస్తే మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కే రామ్మోహనరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం శిధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.